# బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలకు మొండిచెయ్యి

- పాతసీసాలో కొత్తసార అన్నచందంగా బడ్జెట్
- అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు
- ప్రజలను పచ్చిగా మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రాష్ట్ర బడ్జెట్‌పై స్పందించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి


శివ్వంపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి


కొడిపల్లి: నల్ల పోచమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

శివ్వంపేట, మార్చి 19: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు మొండిచెయ్యి చూపిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర బడ్జెట్‌పై ఆమె మాట్లాడారు. బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మికి రూ.2500 నగదు, చేయూత పింఛన్ రూ.4వేలు, రైతు రుణమాఫీలో కోత, రైతు భరోసా కేవలం 3ఎకరాల వరకే ఇచ్చి చేతులు దులుపుకొన్నదన్నారు. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి లేదు, యువ వికాసం కింద చదువుకునే విద్యార్థులకు రూ.5 లక్షలు ఇస్తామన్న హామీల ఊసే లేదన్నారు. ఇచ్చిన హామీలేంది.. పెట్టిన బడ్జెట్ ఏమిటని చూస్తే ప్రజలను పచ్చిగా మోసం చేస్తున్నారని విమర్శించారు. రెసిడెన్సియల్ పాఠశాలలను పట్టించుకోకుండా స్కిల్ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అంటూ పారదర్శకత లోపించేలా బడ్జెట్ పెట్టారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతులకు నిరంతరాయంగా విద్యుత్ ఇస్తున్నామని అసెంబ్లీ సాక్షిగా అబద్ధం చెబుతున్నారన్నారు. రైతులను అడిగితే తెలుస్తుందన్నారు. రేషన్ బియ్యం నెలాఖరు వరకు షాపులకు రావాల్సి ఉండగా, మరింత ఆలస్యం అవుతున్నదన్నారు. మొత్తంగా రాష్ట్ర బడ్జెట్ పాత సీసాలో కొత్తసారా అన్న చందంగా ఉందన్నారు. రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల పక్షాన కొట్లాడుతుందని స్పష్టం చేశారు. .

### సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

కొత్తపేటలోని పలు కాలనీల్లో సీసీరోడ్డు పనులకు రూ. 21 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు విడుదల కావడంతో బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు అతిథులను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, మాజీ వైస్ఎంపీపీ రమాకాంత్ రెడ్డి, నాయకులు యాదాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, లాయక్, నరేందర్, రాజేందర్, శేఖర్‌గౌడ్, లక్ష్మీనర్సయ్య ఉన్నారు

### అమ్మ వారి దయతో ప్రజలు చల్లగా ఉండాలి

కొడిపల్లి, మార్చి 19: అమ్మ వారి దయతో నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులు, పాడిపంటలతో చల్లగా ఉండేలా దీవించు తల్లి అంటూ వేడుకున్నానని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని తునికి గ్రామంలో వెలిసిన నల్లపోచమ్మ జాతరలో ఆమె పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు ఓట్లేసి గెలిపించిన ప్రజలకు సేవ చేసేందుకు అమ్మవారు శక్తిని ప్రసాదించాలన్నారు. మిషన్ భగీరథ పైపులైన్ సమస్య ఉండడంతో నీరు రాలేదని, వచ్చే జాతర వరకు తీసుకొస్తానని తెలిపారు. మూడో రోజు నల్లపోచమ్మకు శివసత్తుల పూనకాలతో బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట ఆలయ ఈవో రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, నాయకులు సాయాగౌడ్, మాణిక్యరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, అశోక్‌గౌడ్, సాయిలు, మహేందర్‌రెడ్డి, ప్రభాకర్‌చారి, కిరణ్‌గుప్తా, మధుగౌడ్, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

### విద్యాశాఖకు కేటాయింపులు తగ్గాయి



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గతేడాది కంటే కేటాయింపులు తగ్గాయి. కాంగ్రెస్ మేనిఫెస్టోలో 15 శాతం ఇచ్చిన హామీకి బడ్జెట్‌లో కేటాయించిన దానికి పొంతన లేదు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. సొంత భవనాలను లేనివాటి గురించి ఆలోచన చేయకుండా నిధులు కేటాయించడం పద్ధతిగా లేదు.

**- నవాత్ సురేశ్, తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

### గురుకులాలనే పట్టించుకోవడం సరికాదు



రాష్ట్రంలోని గురుకులాలను తప్ప ప్రభుత్వ పాఠశాలలను ఏ మాత్రం పట్టించుకోలేదు. రాష్ట్రంలో 1023 ప్రభుత్వ రెసిడెన్సియల్ స్కూళ్లు ఉండగా, 662కు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగతా వాటికి సొంత భవనాలు లేవు. కొత్తగా యంగ్ ఇండియన్ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం రూ.11600 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది.

**- చల్లా లక్ష్మణ్, తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి**

### విద్యా రంగానికి అరకొర నిధులు



రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం కేటాయిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిన సర్కార్ తీరా బడ్జెట్‌లో 7.57 శాతం మాత్రమే కేటాయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు ఎక్కువగా చదువుతారు. బడ్జెట్‌లో విద్య, వైద్య రంగానికి ఎక్కువ శాతం నిధులు కేటాయించాలి. పూర్తిగా ఈ రెండు రంగాలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి.

**- మల్లారెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు**

### సర్కారు బడుల్లో విద్యను మెరుగు పర్చలేం



ప్రభుత్వ బడుల్లో వసతుల కల్పనలో జాతీయస్థాయిలో 36 రాష్ట్రాల్లో తెలంగాణ 32వ స్థానంలో ఉంది. నాణ్యమైన విద్య, సమర్థవంతంగా బడుల నిర్వహణలో 27వ స్థానంలో ఉంది. ఈసారి 0.25 శాతం నిధుల కేటాయింపు ఉంది. 18,259 ప్రాథమిక, 4,843 ఉన్నత పాఠశాలల గురించి ప్రస్తావన లేదు. గురుకులాలకు నిధులు మాత్రం కేటాయించలేదు.

**- యాదగిరి, టీపీటీఎఫ్, జిల్లా అధ్యక్షుడు**

### ఏఐ ఆధారిత బోధన పరిశీలన


ఏఐ ఆధారిత విద్యాబోధనను పరిశీలిస్తున్న డీఈవో

శివ్వంపేట, మార్చి 19: మండలంలోని చండి, గోమారం, చిన్నగొట్టిముక్ల ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ విద్యాబోధన తీరుపై బుధవారం డీఈవో రాధాకిషన్, ఎంఈవో బుచ్యానాయక్‌తో కలిసి పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ కనబర్చాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు దాసు, రవీందర్, అంజి తదితరులు ఉన్నారు.

### పరీక్ష ప్యాడ్ల పంపిణీ

పాపన్నపేట, మార్చి 18: పాపన్నపేట మండలంలోని పొడ్చన్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం యువజన సంఘం ప్రతినిధి సంతోష్ రెడ్డి పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. విద్యార్థుల జీవితాల్లో పదో తరగతి తొలి మెట్టు అని చెప్పారు. కార్యక్రమంలో రుక్మారెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# అధికారులు జవాబుదారీగా పనిచేయాలి


పాపన్నపేట: ఏడుపాయల్లో స్థితిగతులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్


కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

- సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి
- ఏడుపాయల్లో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తాం
- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): తహసీల్దార్లు జవాబుదారీగా పనిచేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ నగేశ్, డీఆర్‌వో భుజంగరావు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, రెవెన్యూ సిబ్బందితో కలిసి ప్రజావాణి, ధరణి సమస్యలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, రికార్డు మేనేజ్‌మెంట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సంబంధిత అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న ప్రజలకు పారదర్శక రెవెన్యూ పాలన అందించాలనే లక్ష్యంతో ముందుకుపోవాలన్నారు. ధరణి స్పెషల్ డ్రైవ్ చేపట్టి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై ప్రణాళిక బద్ధమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తు తీసుకుని కార్యాలయానికి వచ్చినప్పుడు సముదాయించి సమాధానం ఇవ్వాలన్నారు. సమస్యకు పరిష్కారం దొరుకుతుందనే భావన వారిలో కలిగేలా చూడాలన్నారు. ప్రతి తహసీల్ కార్యాలయంలో రికార్డులు భద్రపరిచేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఏవో యూనస్, మెదక్ ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

### ఏడుపాయల్లో చలువ పందిల్లు ఏర్పాటు చేస్తాం

పాపన్నపేట, మార్చి 19: వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని ఏడుపాయలకు వచ్చే భక్తులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. ఏడుపాయల్లో సౌకర్యాలు కరువు అన్న శీర్షికన నమస్తే తెలంగాణలో ఇటీవల ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. బుధవారం ఆయన ఏడుపాయలకు చేరుకుని స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజగోపురం నుంచి ఆలయం వరకు చలువ పందిల్లు ఏర్పాటు చేస్తామని, తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. కలెక్టర్ వెంట పాపన్నపేట తహసీల్దార్ సతీశ్, పూజారి శంకర్ శర్మ తదితరులు ఉన్నారు.

## బ్రాహ్మణ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక


నాగరాజు శర్మ

మెదక్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ శర్మ సమక్షంలో జిల్లా సంఘం ఎన్నికలు తూప్రాన్‌లోని దేవి గార్డెన్స్‌లో నిర్వహించారు. సంఘం ఎన్నికల అధికారులు సోమయాజుల రవేంద్రశర్మ, సీనియర్ పాత్రికేయుడు డీజే శర్మ, మధుశ్రీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. మెదక్ జిల్లా బ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షుడిగా రాజశేఖర్ శర్మ, జిల్లా కార్యదర్శిగా బ్రహ్మశ్రీ కాశీనాథ్ రావు, ఉపాధ్యక్షుడిగా నాగరాజు శర్మ, కోశాధికారిగా హరికృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## పది పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ అమలు

మెదక్ అర్బన్, మార్చి 19: పది పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ అమలులో ఉంటుందని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో 68 పరీక్ష కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. అన్ని కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. అన్ని జిరాక్స్ సెంటర్స్ మూసివేయాలని, 500 మీటర్ల వరకు ఐదుగురికంటే ఎక్కువ మంది ప్రజలు గుమికూడావద్దని పేర్కొన్నారు.

## రైతుల ప్రైవేటు అప్పులు తీర్చేందుకు బ్యాంకు రుణాలు

### తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరిరావు


అధికారులు, బ్యాంకు మేనేజర్లు, రైతులతో పాకాల శ్రీహరిరావు

మెదక్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): రైతులు ప్రైవేట్ అప్పులు తీర్చుకోడానికి, బ్యాంకులు అదనపు రుణాలు ఇవ్వాలని తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు పేర్కొన్నారు. బుధవారం హవేళీఘనపూర్‌లోని రైతు వేదికలో బ్యాంకర్లు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులతో న్యాయ సేవాధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వు బాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలు, పాకాల శ్రీహరిరావు హైకోర్టులో వేసిన ప్రజా ప్రయోజన వాజ్యం ప్రకారం బ్యాంకులు పంట రుణాలు, దీర్ఘ కాలిక రుణాలకు దరఖాస్తులను ఏప్రిల్ రెండో వారం నుంచి స్వీకరించడానికి బ్యాంకర్లు ఒప్పుకున్నారన్నారు. వెంటనే వారి బ్యాంకుల్లో ఇలాంటి అప్పు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు యాదాగౌడ్, మైసయ్య యాదవ్, అంతంగారి వెంకటేశం, మిర్యాల చంద్రశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657

### సమతామూర్తుల క్యాలెండర్ ఆవిష్కరణ



రామాయంపేట, మార్చి 19: హోలియాబాయి త్రి శతాబ్ది వేడుకల సందర్భంగా రామాయంపేట సామాజిక సమరసత వేదిక రాష్ట్ర సభ్యుడు బైరం నర్సింహులు ఆధ్వర్యంలో బుధవారం కోనాపూర్‌లోని హరిజనవాడలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్, హోల్కర్ చిత్రపటాలను స్థానికులకు అందజేశారు.

# పైపులైన్ లీకేజీలను అరికట్టాలి




చిన్నశంకరంపేట, మార్చి 19: చిన్నశంకరంపేటలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో నీరు వృథాగా పోతుంది. లీకేజీలతో తాగునీరు కలుషితం అవుతుందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో తాగునీటి కోసం ఇబ్బందులకు గురవుతుంటే, పైపులైన్ లీకేజీలను అరికట్టకపోవడం సరికాదన్నారు. దీంతో తాగునీరు వృథాగా పోతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మరమ్మతులు నిర్వహించి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

నర్సాపూర్, మార్చి 19: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నచింతకుంట గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నచింతకుంటకు చెందిన బండపోచయ్య (50) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. తన భార్య చనిపోయింది. దీంతో అదే గ్రామానికి చెందిన మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి బండ పోచయ్య మద్యం తాగి సదరు మహిళతో గొడవపడి, పురుగు మందు తాగాడు. నొప్పిని భరించలేక పోచయ్య అరవడంతో గమనించిన సదరు మహిళ కుమారుడు బండ కుమార్, పోచయ్య కుమారుడైన బండ మహేందర్‌కు సమాచారం అందించాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోచయ్యను నర్సాపూర్ ఏరియా దవాఖానకు, అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. దవాఖానలో పోచయ్య చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నర్సాపూర్, మార్చి 19: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపల్లి జాతీయ రహదారిపై జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా దుండిగల్ గ్రామానికి చెందిన గడ్డమీది మహేశ్ (33) మంగళవారం నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చాడు. అదే రోజు రాత్రి రెడ్డిపల్లి చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా నర్సాపూర్ నుంచి మెదక్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని లారీ అతివేగంగా, అజాగ్రత్తగా వస్తూ మహేశ్‌ను ఢీకొట్టింది. దీంతో మహేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గడ్డమీది శృతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

## ఉరేసుకుని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


గరుగుల భాను (ఫైల్)

నిజాంపేట, మార్చి 19: నిజాంపేటకు చెందిన గరుగుల భాను (18) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివి, ఇంటి వద్దనే ఉంటున్నాడు. చదువుకోవాలని లేకుంటే పనికి పోవాలని భానును తల్లిదండ్రులు మందలించారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన భాను మంగళవారం రాత్రి ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు భానును దుబ్బాక దవాఖానకు తరలించారు. అప్పటికే భాను మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. మృతుని తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## కుక్కను తప్పించబోయి ఒకరు..


బొంతపల్లి కృష్ణ మృతదేహం

తూప్రాన్, మార్చి 19: కుక్కను తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన తూప్రాన్ మున్సిపాలిటీ పరిధి కరీంగూడ బ్రిడ్జి సమీపంలో జరిగింది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన బొంతపల్లి కృష్ణ (32) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో బుధవారం మధ్యాహ్నం డాక్టర్ వద్దకు వెళ్తామని తన యాక్టివాపై తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు బయలుదేరాడు. దవాఖానలో చూయించుకుని, తిరిగి వెళ్తుండగా కరీంగూడా బ్రిడ్జి వద్ద కుక్క అడ్డు రావడంతో వాహనం అదుపుతప్పి కృష్ణ కింద పడి, అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పంట మార్పిడితో భూసారం పెరుగుతుంది


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు


చిన్నశంకరంపేట, మార్చి 19: పంట మార్పిడి ద్వారా భూసారం పెరిగి అధిక దిగుబడిని పొందవచ్చని జిల్లా వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు రాజ్‌నారాయణ రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధి సూరారంలోని రైతు వేదికలో సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. సేంద్రియ పద్ధతిన వ్యవసాయ చేయాలని, రసాయనాల వాడకాన్ని తగ్గించాలన్నారు. కోతుల బెడద ఉన్న రైతులు సోలార్ పరికరాలను ఉపయోగించి. వాటి బెడదను తప్పించుకోవచ్చన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే పంటలు వేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాధికారి లక్ష్మీప్రవీణ్, సెహగల్ ఫౌండేషన్ సభ్యులు కావ్యారెడ్డి, రాఘవేందర్, విక్రాంత్, మణిదీప్, చాంద్‌పాషా పాల్గొన్నారు.

## ఓటరుగా నమోదు చేయించుకోవాలి


వివిధ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీవో

నర్సాపూర్, మార్చి 19: 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో మహిపాల్ వెల్లడించారు. బుధవారం నర్సాపూర్‌లోని తన కార్యాలయంలో ఆర్డీవో మహిపాల్ వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఎస్ఆర్ 2025కు సంబంధించిన ఓటరు వివరాలను పార్టీ నాయకులకు అందించారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి ఓటరు ఆధార్ అనుసంధానం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ తడులతో వరిని కాపాడుకోవాలి



నర్సాపూర్, మార్చి 19: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వరి ఎండిపోకుండా ప్రత్యామ్నాయ తడులు ఇచ్చి కాపాడుకోవాలని ఏడీఏ సంధ్యారాణి సూచించారు. బుధవారం మండలంలోని లింగాపూర్, సీతారాంపూర్ గ్రామాల్లో ఏడీఏ సంధ్యారాణి వరిని పరిశీలించారు. ఆమె వెంట ఏఈవోలు దుర్గాప్రసాద్, చంద్రవేణి పాల్గొన్నారు.

## ఎల్ఐసీ ఏజెంట్లకు న్యాయం చేయాలి



ఢిల్లీలో ధర్నా చేస్తున్న మెదక్ జిల్లా ఎల్ఐసీ ఏజెంట్లు

రామాయంపేట, మార్చి 19: ఏజెంట్లకు బోనస్ పెంచాలని మెదక్ ఎల్ఐసీ బ్రాంచ్ అధ్యక్షుడు మాణిక్యరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాకు చెందిన ఎల్ఐసీ ఏజెంట్లు ఢిల్లీలోని మెయిన్ బ్రాంచ్ వద్ద ధర్నాకు దిగారు. ఎల్ఐసీలో ఏండ్లుగా పనిచేస్తున్న తమకు బోనస్‌లు పెంచమంటే, సంస్థ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పట్నం చంద్రశేఖర్, విజయభాస్కర్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.